# ముద్దులొలికే సేవాధర్మం

"శుక్రవారం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో అమ్మ వస్తోంది. స్టేషన్ కొచ్చి తీసుకెళ్ళు" అని మా తమ్ముడు ఇచ్చిన టెలిగ్రాం; శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల కొచ్చింది. టెలిగ్రాం హైద్రాబాద్ సెంట్రల్ టెలిగ్రాఫ్ ఆఫీసులో బుధవారం 17 గంటల 15 నిమిషాలకి అంటే సాయంకాలం ఐదుంపావుకి ఇచ్చినట్టు తెలుస్తోంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్ ఉదయం తొమ్మిదింటికే ఈ ఊరు చేరుతుంది.

ముసలావిడ. ఇంటికి తనంతట తాను చేరుకోలేదు. గోదావరిలో ఉదయం అనంగా దిగి, నేను కనబడక, ఏ గంగలో దిగడమో తెలీక, అలా ఫ్లాట్‌ఫారం మీదనే వుండి పోయిందేమో అని తల్లడిల్లాను. పక్కింటి సర్వేశ్వర్రావుగార్నీ స్కూటర్నీ బ్రతిమాలుకుని రైల్వే స్టేషన్ కెళ్ళాను.

మా అమ్మ కనబళ్ళేదు. ప్లాట్‌ఫారం, లేడీస్ వెయిటింగ్ రూము ఆఖరికి రైల్వే ప్రొటెక్షన్‌ఫోర్సు ఆఫీసు అన్నీ చూసేశాను.

"శుక్రవారం గోదావరి ఎక్స్‌ప్రెస్సంటే శుక్రవారం అక్కడ బయల్దేరే బండేమో, మీరు అనవసరంగా కంగారుపడ్డారు. రేపు ఉదయం స్టేషన్ కెళ్ళండి" అంది మా ఆవిడ టెలిగ్రాంకి భాష్యం చెప్పి—

శనివారం ఉదయం రైల్వే స్టేషన్ కెళ్ళాను.

ఊఁహూఁ.

"నీ టెలిగ్రాం శుక్రవారం రాత్రి అందింది. శనివారం ఉదయం ఇక్కడికి చేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో అమ్మరాలేదు. క్షేమసమాచారం టెలిగ్రామియ్యి" అని మా తమ్ముడికి ఎనిమిది రూపాయల టెలిగ్రాం ఇచ్చాను.

బుధవారం రాత్రి మళ్ళా టెలిగ్రాం వచ్చింది. "అమ్మ బయలు దేరింది గురువారం గోదావరిలో శుక్రవారం చేరేది. కాకర్ల కనకారావు ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసు కేరాఫ్‌లో విచారించి అమ్మ క్షేమ సమాచారం టెలిగ్రాం ఇయ్యి" అది పన్నెండురూపాయల టెలిగ్రాం. ఆయనెవరో ఈ వూరు వస్తుంటే తోడున్నారు కదాని ఆయనతో పంపాట్ట.

అంటే, శుక్రవారమే ఈ ఊళ్ళోకొచ్చి ఇంటికి చేరడం తెలీక పాపం! ఈ అయిదురోజులూ ఆ కనకారావు గారింట్లోనే వుండి పోయిందన్న మాట; మా అమ్మ!

మన ప్రజాసేవా శాఖల చురుకుతనానికి నిదర్శనాలుగా తిరుపతి వెంకన్న నిదర్శనాలనీ సత్యసాయిబాబాగారి నిదర్శనాలనీ మించినన్ని మంచి మంచి కథలున్నాయి. ఎవరో ఒకాయనకి ఉద్యోగం ఇస్తున్నట్టు వేసిన ఆర్డర్ ఇరవై ఏడేళ్లు ప్రయాణం చేసిన సంగతి, ఆంధ్రదేశం లోనే ఒక ఊరికి రాసిన ఉత్తరం అమెరికా వెళ్ళి పైన్రి ఇండియా అని రాయించుకుని రావడం; ముక్కానీ వెల వుండిన రోజులలో డబ్బాలో ప్రవేశించిన కార్డు పదిహేను పైసల రోజులుదాకా తోకలేని పిట్టలా తొంభై ఊళ్ళు తిరిగి చివరికి రెండో తరం మనుషులకి చేరడం; పైపెచ్చు ధరలు పెరిగిన కారణంగా 'డ్యూ' వసూలు చేయడం-ఇల్లాంటి కథ లెన్నెన్నో!

రంగరాజుగారని మా స్నేహితుడొకాయన, పిన్‌కోడ్ పద్ధతి ప్రవేశపెట్టిన కొత్తలో అన్నాడు. "మామూలుగా టౌన్లలో పోస్టల్ జోన్ నెంబర్లు ఒకటీ నాలుగు తొమ్మిది లాంటివే గుర్తుండి చావ్వు. ఈ ఆరేసి అంకెలెలా గుర్తెట్టుకోవాలి బాబూ!"

"పిన్‌కోడ్ అనడంలో పిన్నుకీ దీనికీ సంబంధం లేదు రాజు గారూ! దీన్ని పోస్టల్ ఇండెక్స్ నెంబరంటారు. ఊరిపేరు రాయక పోయినా పిన్‌కోడ్ నెంబరు వేస్తే చాలు ఉత్తరం ఇచ్చేస్తారు తెల్సా?" అని నచ్చజెప్పినా వినక, "పింకోడ్ గురించి ఇంకోడు నాకు జెప్పడ మేమిటి" అని ఉత్తర సన్యాసం చేశాడు. అంటే ఉత్తరాలు రాయడం, రప్పించుకోడం రెండూ మానేశాడు. అంతగా తనే చక్కబెట్టవలసిన వ్యవహారం వుంటే ఆ ఊళ్లు వెళ్ళిరావడం మొదలెట్టాడు.

రమణమూర్తి అని, మా ఆఫీసులో తెలుగు టైపిస్టు. ఉత్తరం అంతా చేత్తోనే రాసినా, అడ్రస్ మాత్రం టైప్ చేస్తాడు. (అతని దస్తూరీ అలాంటిది, మరి!) "రెబ్బాప్రగడ సుబ్బరామయ్య, గోవింద పురం లేఔటులో పోస్టాఫీసు వున్న వీధి. అదే వరుస, అంతే ముంజులూరి ఆంజనేయులు వీధి, వనపర్తివారి ఇల్లు, మేడమీది వాటా గోవిందపురం లేఔటు-" అంటూ అడ్రస్ వివరంగా రాసి, ఆఖర్న రిబ్బన్ ఎరుపులోకి మార్చి ఊరిపేరూ పిన్‌కోడ్ నెంబరూ కొడితే, ఆ ఉత్తరం వారం రోజులకల్లా; అడ్రస్ స్పష్టంగా లేదని తిరిగొచ్చే సింది. నేను చెబుతూనే వున్నాను. అంత భారతం వద్దయ్యా బాబూ! 39-13-24A ముంజులూరి వారి వీధి అని రాస్తే సరిపోతుందని, విన్నాడు కాదు.

రమణమూర్తికి తను రాసిన ఉత్తరం అవతలివాళ్ళకి అందు తుందో లేదోనని చచ్చే భయం. అడ్రసంతా పూర్తిగా అతనికి తోచినంత వివరంగా టైప్ చేసి "ఆయన ఇంట్లో లేకపోయినా ఉత్తరం ఇచ్చెయ్యొచ్చు" అనో; "వాళ్ళు ఇల్లు మారలేదు సర్మండీ" అనో

సూచనలు ఎర్ర అక్షరాల్లో టైప్ చేసే అలవాటుంది. అతను చిన్నసైజు రచయిత. పదేళ్ళనుంచీ కవితలూ, కథలూ రాస్తున్నా ఒక్క పత్రిక కూడా కాంప్లిమెంటరీ కాపీ ముచ్చటకైనా పుచ్చుకోలేని దౌర్భాగ్యుడు.

వాళ్ళ మరదలి పెళ్ళి సందర్భంగా వాళ్ళావిడను పదిరోజులు ముందుగానే పుట్టింటికి పంపవలసివచ్చింది.

"అక్కడికి చేరగానే ఉత్తరం రాయి, మర్చిపోకు! అడ్రస్ సరిగ్గా రాసి, పిన్‌కోడ్ నెంబరు వెయ్యి. తెల్సిందా? కవరు రాయకు, ఎందుకైనా మంచిది, కార్డే రాయి!" అని చెప్పి పంపాడు.

ఆవిడ అక్కడికి చేరిన రెండోరోజుకల్లా ఆవిడ రాసిన ఉత్తరం ఆఫీస్ అడ్రస్‌కి వచ్చేసింది. "మా ఆవిడ ఎక్కిన బస్సు యాక్సిడెంటవకుండా మా మామగారి ఊరు చేరింది, మా ఆవిడ రాసిన ఉత్తరం వెంటనే వొచ్చింది!" అని కేరింతలు కొడ్తూ మెసింజర్ని కేకేసి పదిహేను టీలు ఆర్డర్ చేశాడు, ఉత్తరం అసలు చదవకుండానే.

"నేను నమ్మను. ఉత్తరమేమిటి; రెండురోజుల్లో మువ్వ య్యేనిమిది మైళ్ల ప్రయాణంచేసి రావడమేమిటి?" అని సవాల్ చేశాడు శ్రీనివాసరావు.

"చూస్కో కావాలంటే!" అని, పెళ్ళాం రాసిన ఉత్తరం అన్నైనా సంకోచం లేకుండా ఆ కార్డుని నలుగుర్లోను పెట్టాడు రమణమూర్తి.

ఆవిడ, మొదటి పేజీలో "క్షేమంగా చేరాను. ఇట్లు నీ అర్ధాంగి నాగమణి" అని మాత్రం రాసింది. రెండో పక్క; అంటే అడ్రస్ పేజీలో "ఈ ఉత్తరం సరిగ్గా డెలివర్ చేసిన పోస్టుమాన్‌కి ముద్దులు" అని రాసింది.

"ఏం చేస్తాం మరి? ఉత్తరం సరిగ్గా అందాలంటే ఎంతకైనా దిగజారాలి మరి!" అని రమణమూర్తి సమర్ధించుకున్నాడు.

(28-5-84)

—//—